

నాటుసారా రహిత జిల్లాగా మారుద్దాం

అన్నమయ్య జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా మారుద్దామని ఎస్పీ గంగాధర్ రావు పిలుపునిచ్చారు. -8లో



భర్త ఇంటిముందు భార్య నిరసన

తనకు న్యాయం చేయాలని భర్త ఇంటి ముందు భార్య నిరసన చేసింది. తనను మోసం చేసి మరొకరిని పెళ్లి చేసుకున్నాడని ఆందోళనకు దిగింది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.320	రూ.400
రెండోరకం	రూ.220	రూ.310

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 256 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	542	542
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 56.540 కిలోలు

న్యూస్‌రీల్

సహకార చక్కెర కర్మాగారాల బలోపేతమే లక్ష్యం

రాయచోటి: సహకార చక్కెర కర్మాగారాల బలోపేతానికే కేంద్ర ప్రభుత్వం సహకార్ సే సమృద్ధి (సహకారం ద్వారా శ్రేయస్సు) కార్యక్రమం మొదలుపెట్టిందని కలెక్టర్ గిరీషా ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన మంత్రి కలని సాకారం చేయడానికి కేంద్ర, సహకార మంత్రిత్వశాఖ అనేక కార్యక్రమాలు చేపట్టిందని, వాటిలో సహకార్ సే సమృద్ధి ఒకటని పేర్కొన్నారు. ఈ మంత్రిత్వశాఖ ద్వారా 13 విభిన్న భాషల్లో ఈ కార్యక్రమంపై ఒక చిన్న వీడియో రూపొందించబడిందని, తెలుగు భాషలో https://youtube/utqfZOQbygU లింక్ ద్వారా చూడవచ్చని వివరించారు.

దోమల నివారణ ముఖ్యం



ప్రపంచ దోమల నివారణ దినోత్సవం బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ,అధికారులు

రాయచోటి అర్బన్: వ్యాధుల బారిన పడకుండా తమను తాము రక్షించుకోవాలంటే దోమలను నివారించడం ముఖ్యమని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కొండయ్య తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో ఆయన దోమల నివారణ దినోత్సవ బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్యసంస్థ పిలుపు మేరకు యేటా ఆగస్టు 20న ప్రపంచ దోమల నివారణ దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వైద్యశాఖ ఉన్నతాధికారులు మాసాపేట జడ్పీహైస్కూల్‌లో, శివ నర్సింగ్ కళాశాలలో విద్యార్థులకు మలేరియా జ్వరాలవ్యాప్తి, ప్రపంచ దోమల దినోత్సవం నిర్వహణపై అవగాహన కల్పించారు. జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చెప్పారంటే.. చేస్తారంతే

రాయచోటి : సీఎం జగన్ మాటిచ్చారంటే చేసి తీరుతారని వైఎస్‌ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే జి.శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. రాయచోటి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం అన్నమయ్య జిల్లా కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సీఎం జగన్‌కు కృతజ్ఞత సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు సంబంధించి ఐదేళ్ల సర్వీసు నిబంధనను ఎత్తివేస్తూ సీఎం జగన్ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. ఈ నిర్ణయంతో 2014 జూన్ 2వ తేదీకి ముందు నియమితులై ఇప్పటి వరకు కొనసాగుతున్న కాంట్రాక్టు ఉద్యోగులందరి సర్వీసు రెగ్యులర్ చేయనున్నారన్నారు.అన్ని వర్గాల ప్రజలు, ఉద్యోగులలో సీఎం జగన్‌కు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయన్నారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం

వీలైనంత ఎక్కువ మంది కాంట్రాక్టు ఉద్యోగులకు మేలు చేయాలన్న ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి జగన్ తీసుకున్న నిర్ణయం పట్ల కాంట్రాక్టు లెక్చరర్లు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. కాంట్రాక్టు ఉద్యోగుల కుటుంబాలకు మేలు చేస్తూ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి జగన్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిని సత్కరించారు.



సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

కారుణ్యం కింద ఉద్యోగాలిస్తాం

జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటి

కడప సెవెన్‌రోడ్స్: కారుణ్య నియామకాల కింద ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, ఇప్పటికే ఆ దిశగా ఎంతోమందికి ఉద్యోగాలు ఇచ్చామని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం జెడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో బాధిత కుటుంబాలకు చెందిన అభ్యర్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలాంటి జాప్యం లేకుండా కారుణ్య నియామకాల కింద జిల్లా పరిషత్ పరిధిలో ఉద్యోగాలు ఇస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ అంశానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని వివరించారు. జెడ్పీలో సుమారు 50 వరకు అటెండర్ పోస్టులు ఉన్నాయని వెల్లడించారు. దీనిపై అభ్యర్థులు మాట్లాడుతూ తమకు జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలు కావాలని కోరారు. దీనిపై జెడ్పీ చైర్మన్ స్పందిస్తూ అవి తన అధికార పరిధిలో లేవన్నారు. బాధిత కుటుంబాల్లో చాలా మందికి వయోపరిమితి కూడా దాటిపోయే పరిస్థితి వస్తోందని చెప్పారు. చిన్నదని భావించకుండా తొలుత ఉద్యోగంలో చేరాలని, ఆ తర్వాత అవకాశాల గురించి ఆలోచించాలని సూచించారు. జిల్లా పరిషత్ పరిధిలో ఉద్యోగం చిన్నదైనా ప్రభుత్వ ఉద్యోగం కనుక భద్రత ఉంటుందని తెలిపారు. జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ రమణారెడ్డి, ఏఓ రంగాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

క్రీడా పాఠశాల ప్రవేశ ఫలితాలు విడుదల

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో 4, 5వ తరగతిలో ప్రవేశాలకు సంబంధించిన ఎంపికైన విద్యార్థుల జాబితాను అధికారులు ప్రకటించారు. ఈ మేరకు స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్, డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎస్.వి.పి. అమృత్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయి ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను మెడికల్ టెస్ట్‌లకు ఎంపికచేసినట్లు తెలిపారు. ప్రవేశాలకు ఎంపికైన బాలురు ఈనెల 21న, బాలికలు 22వ తేదీన విజయవాడలోని వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ ప్రక్కన ఉన్న ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో ఉదయం 9 నుంచి 2 గంటలలోపు హాజరుకావాలని సూచించారు.

4వ తరగతి బాలురు: జి. చరిత్, జి. వెంకటరమణ నిరంజన్, జి.వి.నిఖిల్‌కుమార్ ఆచారి, జె. సాయికొర్ష, సి.ఎ.గురుస్వామి, డి. ప్రశాంత్. **4వ తరగతి బాలికలు :** ఎం.భవిష్య, కె. వెంకటలాస్య, కె. వెంకటధన్య, జి.వై. భవిష్య **5వ తరగతి :** బి. వెంకటేష్, యు. పద్మావతి, పి. గంగాకావ్య

విద్యార్థులకు హెచ్‌బీ పరీక్షలు నిర్వహించాలి

డీఈఓ శ్రీరాం పురుషోత్తం

మదనపల్లె సిటీ: జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు హెచ్‌బీ (హిమోగ్లోబిన్) పరీక్షలు నిర్వహించి, వారికి ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలు తప్పకుండా ఇవ్వాలని జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరాం పురుషోత్తం అన్నారు. శనివారం మదనపల్లె పట్టణం రాంరెడ్డిలేవుట్‌లోని వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు హెచ్‌బీ పరీక్షలు జరుగుతున్నాయా? మాత్రలు ఇస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు సమాధానం చెప్పకపోవడంతో సంబంధింత సచివాలయ ఆరోగ్య సిబ్బందిని పిలిపించి మాట్లాడారు. పరీక్షల కిట్స్ శుక్రవారం వచ్చాయని త్వరలో చేస్తామని ఆరోగ్య సిబ్బంది సమాధానమిచ్చారు. ఈ విషయం డీఎంహెచ్‌ఓ దృష్టికి తీసుకెళ్తానని డీఈఓ పేర్కొన్నారు. అంతకుముందు పదో తరగతి గదికి వెళ్లిన డీఈఓ ఐఎఫ్‌పి వల్ల విద్యార్థులకు పాఠాలు అర్థమవుతున్నాయా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుడిగా మారి సిలబస్‌లోని ప్రశ్నలు అడిగారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా డిజిటల్ బోధన తీసుకువచ్చిందన్నారు. ప్రతి ఉపాధ్యాయులు దీన్ని ఉపయోగించాలని లేకుంటే చర్యలు తప్పవన్నారు. పాఠశాల హెచ్‌ఎం రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



హెచ్‌బీ పరీక్షలు గురించి ఆరోగ్య సిబ్బందిని అడుగుతున్న డీఈఓ పురుషోత్తం

ప్రశాంతంగా కౌన్సెలింగ్

కడప రూరల్: కడప జోన్-4 పరిధిలో శనివారం కాంట్రాక్ట్, స్టాఫ్ నర్స్‌ల నియామక కౌన్సిలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 118 మందికి స్టాఫ్ నర్స్‌లుగా పోస్టింగ్‌లు కల్పిస్తూ పత్రాలను అందజేశారు.

వైఎస్సార్ సీపీ మద్దతుదారుల హవా

- రెండు సర్పంచ్ స్థానాలు, 44 వార్డులు ఏకగ్రీవం
- 3 వార్డుల్లో జరిగిన ఉప ఎన్నికలు
- ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు



లక్కిరెడ్డిపల్లె 2వ వార్డులో క్యూలో నిల్చున్న ఓటర్లు

రాయచోటి: అన్నమయ్య జిల్లా పరిధిలోని సర్పంచ్, వార్డుల ఖాళీ స్థానాల్లో జరిగిన ఉపఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారులు హవా చూపించారు. రెండు సర్పంచ్, 48 వార్డు మెంబర్ స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయింది. వీటిలో రెండు సర్పంచ్ స్థానాలకు, 44 వార్డు స్థానాలకు ఒక్కొక్క నామినేషన్ దాఖలు కావడంతో వాటిని ఏకగ్రీవం అయినట్లు ఇదివరకే ప్రకటించారు. ఇవన్నీ వైఎస్సార్ సీపీ మద్దతుదారులే కావడం విశేషం. ఇక నందలూరు మండలం పాటూరు గ్రామ పంచాయతీ 10వ వార్డుకు ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదు.ఇక శనివారం రాయచోటి నియోజకవర్గ పరిధిలో జరిగిన ఎన్నికలలో శిబ్యాల పంచాయతీ 12వ వార్డు నుంచి ఆసాది ఆదయ్య, గొర్లముదివీడు పంచాయతీ 3వ వార్డు నుంచి బి.లక్ష్మీదేవి, లక్కిరెడ్డిపల్లె పంచాయతీ 2వ వార్డు నుంచి ఎస్.మాబున్నీసా గెలుపొందారు.

- రాయచోటి నియోజకవర్గ పరిధిలో జరిగిన 3 వార్డు స్థానాలకు నిర్వహించిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. చిన్నపాటి ఘర్షణలకు తావివ్వకుండా ఎన్నికలను నిర్వహించడంపై అధికారులు ప్రశంసలు అందుకున్నారు.

క్లుప్తంగా

ఆటో ఢీకొని చిన్నారి మృతి


మృతి చెందిన షాబీరా నూరిన్

మదనపల్లె : రోడ్డు దాటి అంగడికి వెళ్లి చాక్లెట్ కొనుక్కుని తిరిగి వస్తున్న రెండేళ్ల చిన్నారిని ఆటో ఢీకొనడంతో మృతి చెందిన ఘటన మండలంలో శుక్రవారం రాత్రి జరిగింది. కొండామద్రిపల్లెకు చెందిన సయ్యద్‌హుస్సేన్ కుమార్తె షాబీరా నూరిన్(2) రాత్రి తమ ఇంటి ముందు ఉన్న చిల్లర అంగడిలో చాక్లెట్ తెచ్చుకుని రోడ్డు దాటుతుండగా.. వేగంగా వచ్చిన ఆటో ఢీకొంది. ప్రమాదంలో చిన్నారి తీవ్రంగా గాయపడగా, హుటాహుటిన జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చిన్నారి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్య చికిత్సలకై తిరుపతికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ షాబీరా నూరిన్ మృతి చెందింది. శనివారం మదనపల్లె తాలూకా పోలీసులు తిరుపతికి వెళ్లి బాలిక మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహింపజేసి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపారు.

కువైట్‌లో తూముకుంట వాసి మృతి


చిన్నబయారెడ్డి (ఫైల్)

గాలివీడు : మండలంలోని తూముకుంట గ్రామం కొత్తపల్లెకు చెందిన చిన్న బయారెడ్డి(45) శనివారం కువైట్‌లో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గత ఇరవై సంవత్సరాలుగా బతుకు దెరువు కోసం కువైట్‌లో వలస కూలీగా జీవనం సాగిస్తుండేవాడు. శనివారం గుండెపోటుకు గురికావడంతో అక్కడికక్కడే కుప్పకూలి మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటనతో కుటుంబ సభ్యుల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డితో సంప్రదింపులు జరుపుతున్నామని, ఆయన సహకారంతో రెండు, మూడు రోజుల్లో మృతదేహాన్ని ఇండియాకు తెప్పించే ఏర్పాట్లు చేస్తున్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

భర్త ఇంటి ముందు భార్య నిరసన


భర్త ఇంటి ముందు బైఠాయించిన భార్య శివజ్యోతి

మదనపల్లె : తనకు న్యాయం చేయాలని భర్త ఇంటి ముందు భార్య దీక్ష చేసింది. తనను మోసం చేసి, మరొకరిని పెళ్లి చేసుకుని, తనకు అన్యాయం చేశాడంటూ ఆందోళన బాట పట్టింది. మదనపల్లె మండలంలోని కురవంకలో శివజ్యోతి శనివారం భర్త ఇంటి ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 11 ఏళ్ల క్రితం తన బావ సోదరుడైన భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్న దేరంగుల రమేష్‌తో పెద్దలు నిర్ణయించిన మేరకు వివాహమైందని, అయితే కొన్ని రోజులు మాత్రమే కాపురం సజావుగా జరిగిందన్నారు. ఆ తర్వాత అదనపు కట్నం కోసం భర్త తరచూ వేధిస్తుండే వాడని, కరోనా సమయంలో తనకు వేరొకరితో సంబంధం ఉందంటూ తప్పుడు ప్రచారం చేసి విడాకుల కోసం కోర్టుకు వెళ్లాడని పేర్కొన్నారు. తాను విడాకులకు ఒప్పుకోలేదని, తనను ఇంటి నుంచి గెంటివేస్తే మదనపల్లెలో తన తండ్రి వద్ద ఉంటున్నట్లు చెప్పారు. మరో యువతిని వివాహం చేసుకున్నాడని, వారికి కుమారుడు ఉన్నట్లు తెలియజేశారు. తన జీవితాన్ని నాశనం చేశాడని, అమ్మ రామలక్ష్మి ఏడాది క్రితం మృతి చెందడంతో తాను తన తండ్రి మాత్రమే జీవిస్తున్నామన్నారు. విడాకుల మంజూరు కోసం తన భర్త రెండో భార్య చరితతో కలిసి న్యాయవాది ద్వారా బెదిరిస్తున్నారని ఆరోపించారు. తమకు విడాకులు మంజూరు కాకపోయినా, రెండో వివాహం చేసుకోవడంతోపాటు తనను ఇంట్లో నుంచి బయటకు పంపేశాడని వాపోయారు. తన కష్టంతో ఇంటి నిర్మాణం చేశానని, అయితే తననే ఇంట్లో నుంచి బయటకు పంపేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు భర్త, అతని రెండో భార్యతో ప్రాణభయం ఉందని, తనకు రక్షణ కల్పించడంతోపాటు న్యాయం చేయాలని కోరారు. ఇంటి ముందు బైఠాయిస్తుందనే విషయం తెలుసుకున్న భర్త రమేష్, అతని రెండో భార్య చరిత బిడ్డతో సహా ఇంటికి తాళం వేసుకుని వెళ్లిపోయారు. తాలూకా పోలీసులు బాధితురాలు వద్ద నుంచి ఫిర్యాదు తీసుకుని విచారణ చేస్తున్నారు.

ప్రేమ కథ సుఖాంతం

మదనపల్లె : రహస్య బంధం కారణంగా ఓ పెళ్లి కాని యువతి.. బిడ్డకు జన్మనిచ్చిన సంఘటన శనివారం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో జరిగింది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి (18) పట్టణంలోని ఓ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసింది. ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటున్న ఆమె.. మదనపల్లెకు తరచూ వచ్చి వెళుతూ ఉండేది. ఈ క్రమంలో ఓ యువకుడితో పరిచయం అయింది. అది కాస్త ప్రేమగా మారి రహస్య బంధానికి దారితీసింది.

పర్యవసానంగా అతని వల్ల గర్భిణి అయింది. యువతి తల్లి ఉపాధి కోసం కువైట్‌కు వెళ్లగా.. తండ్రి మేస్త్రీ పని చేస్తున్నాడు. తాను గర్భిణి అయిన విషయం తెలుసుకున్న యువతి.. అత్యంత గోప్యత పాటించింది. కుటుంబ సభ్యులను సైతం తనకు అనారోగ్యమని నమ్మించింది. తనకు పొట్టలో గ్యాస్ సమస్య ఉందని చెబుతూ.. చుట్టు పక్కల వారిని కూడా మాయం చేసింది. ఈ క్రమంలో శనివారం పురిటినొప్పులు వచ్చాయి. దీంతో కుటుంబ సభ్యులు అనారోగ్యంగా భావించి ఆమెను మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ సాధారణ కాన్పు అయ్యి మగబిడ్డకు జన్మనిచ్చింది. దీంతో రహస్యం బట్టబయలైంది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు యువతిని నిలదీయడంతో తన ప్రేమాయణం మొత్తాన్ని వారికి చెప్పింది. వారు ఇందుకు కారణమైన యువకుడిని ఆస్పత్రికి రప్పించారు. తల్లిదండ్రులు, పలు ప్రజాసంఘాల నాయకులు యువకుడితోపాటు అతడి కుటుంబ సభ్యులతో చర్చించారు. యువతిని వివాహం చేసుకోవాల్సిందిగా ఒప్పించారు. అప్పటికే ఈ ఘటనపై ఆస్పత్రి అవుట్‌పోస్ట్ సిబ్బంది తాలూకా పోలీసులు, ఐసీడీయస్ అధికారులకు సమాచారం అందించారు. తాలూకా పోలీసులు కుటుంబ సభ్యులను విచారణ చేశారు.

21 నుంచి ఫుట్‌బాల్ టోర్నమెంట్


మాట్లాడుతున్న నిర్వాహకులు

మదనపల్లె : మండలంలోని ఆరోగ్యవరం (శానిటోరియం)లో డాక్టర్ కేటీ జెసూడియస్, అలెగ్జాండర్ మెమోరియల్ సౌత్ ఇండియా ఫుట్‌బాల్ టోర్నమెంట్ ఈ నెల 21 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆరోగ్యవరం ఫుట్‌బాల్ లవర్స్ తెలిపారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ... సౌత్ ఇండియా ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు ఆంధ్రప్రదేశ్ నుంచే కాకుండా కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి మొత్తం 16 జట్లు హాజరవుతున్నట్లు తెలిపారు. అన్ని టీమ్‌లకు నాకౌట్ ఉంటుందని, ఎనిమిది మ్యాచ్‌లలో గెలిచిన జట్లకు లీగ్ మ్యాచ్‌లు ఉంటాయని, వాటిలో గెలిచిన టీమ్‌లకు సెమీస్ నిర్వహిస్తామన్నారు. అనంతరం ఫైనల్ మ్యాచ్ ఉంటుందన్నారు. మ్యాచ్‌లో విజేతకు రూ.లక్ష, రన్నర్స్‌కు రూ.50 వేలు, తృతీయ బహుమతి కింద రూ.25 వేల బహుమతులతోపాటు వ్యక్తిగత బహుమతులు అందిస్తామన్నారు. క్రీడలకు సంబంధించి గ్రౌండ్, ఇతర సదుపాయాలు ఆరోగ్యవరం మెడికల్ సెంటర్(ఏఎంసీ) కల్పిస్తున్నట్లు వివరించారు.

కార్లు ఢీకొని పలువురికి గాయాలు



చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు క్రాస్ 10వ నంబర్ మామిడికాయల మండీ సమీపంలో శనివారం రెండు కార్లు ఢీకొనడంతో పలువురికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ రమేష్‌బాబు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఇన్నోవా కారు బెంగళూరు నుంచి కడపకు వెళ్తుండగా.. విజయవాడ నుంచి బెంగళూరుకు వెళ్తున్న సుజుకి కారు మార్గంమధ్యలోని మల్లూరు క్రాస్ వద్దకు రాగానే ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇన్నోవా కారులోని జగబర్, రేష్మా, సుజికి కారులో ఉన్న పలువురికి గాయాలయ్యాయి. వారిని వెంటనే రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు.

ఇంటిని కూల్చి రోడ్డున పడేశారు

- నకిలీ పట్టాతో ఆక్రమించేందుకు ప్రయత్నం
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- ప్రెస్‌క్లబ్‌లో బాధితుడి ఆవేదన


మాట్లాడుతున్న బాధితులు సుబ్రహ్మణ్యం ఆచారి, సుప్రజ దంపతులు

మదనపల్లె : పట్టణంలోని బీకే పల్లె గ్రామంలో 45 ఏళ్లుగా నివాసం ఉంటున్న తనను, భార్యాబిడ్డలతో సహా రోడ్డున పడేసి జేసీబీతో ఇంటిని కూల్చేశారని బాధితుడు కందుకూరి సుబ్రహ్మణ్యం ఆచారి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన కుటుంబ సభ్యులతో కలిసి మాట్లాడారు. తన తండ్రి కందుకూరి వెంకటరమణ ఆచారి పేరుపై సర్వే నంబర్: 371/2లో ప్లాట్ నంబర్: 65లో ప్రభుత్వం మంజూరు చేసిన రెండున్నర సెంట్ల జాగాలో ఇల్లు నిర్మించుకున్నామన్నారు. 2003లో తండ్రి వెంకటరమణ ఆచారి మరణించడంతో అదే ఇంటిలో తాను, భార్య సుప్రజ పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నట్లు తెలిపారు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, తమ కుటుంబానికి సంబంధం లేని కర్ణాటకలోని మైసూరుకు చెందిన జయమ్మ అనే ఓ మహిళ ఇంటికి నకిలీ పట్టాను సృష్టించి నిమ్మనపల్లె మండలానికి చెందిన యాసీన్‌బాషాకు విక్రయించిందన్నారు. కొనుగోలు చేసిన వ్యక్తులు ఇంటిని స్వాధీనం చేసుకునేందుకు రాగా తాము అడ్డుచెప్పి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో వెళ్లిపోయారన్నారు. కొన్ని రోజుల తర్వాత మళ్లీ ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే కేసు నమోదైందన్నారు. ఈ నెల 9న రాత్రి 8.30 గంటల సమయంలో మరోసారి జేసీబీని తీసుకువచ్చి తాను, భార్య, పిల్లలు ఇంట్లో ఉండగానే, బలవంతంగా బయటకు ఈడ్చి పడగొట్టేశారన్నారు. ప్రాణభయంతో తాము అక్కడ నుంచి పారిపోయి జరిగిన విషయాన్ని ఆర్డీఓ, తహసీల్దార్‌కు తెలిపితే వారు పోలీసులకు ఫిర్యాదు చేయాల్సిందిగా సూచించారన్నారు. వారికి ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని వాపోయారు. ఆరోగ్యం సరిగా లేని చంటిపిల్లలతో తాము రోడ్డున పడ్డామని, ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాల్సిందిగా వేడుకున్నారు.

రాయలసీమ ద్రోహి చంద్రబాబు

- సీమకు మేలు చేసింది వైఎస్‌ఆర్, జగన్ మాత్రమే
- ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : చంద్రబాబు తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో రాయలసీమకు ఒరగబెట్టింది ఏమీ లేదని, ఆయన రాయలసీమ ద్రోహి అని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు ఆరోపించారు. శనివారం స్థానిక వైఎస్‌ఆర్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాయలసీమకు మేలు చేయాలనే తలంపుతో పని చేసినది గత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమేనని తెలిపారు. ప్రాజెక్టుల గురించి మాట్లాడే అర్హత చంద్రబాబుకు లేదన్నారు.

బాబు, కరువు కవలలు..


చంద్రబాబూ... నీవు అధికారంలో ఉన్నప్పుడు రాయలసీమకు ఏనాడైనా చుక్క నీరిచ్చావా అని ప్రశ్నించారు. కనీసం చిన్నా, సన్నకారు రైతులకన్నా మేలు చేశావా అని ప్రశ్నించారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే కరువు వస్తుందని రైతులు భయపడుతుంటారన్నారు. ఎందుకంటే చంద్రబాబు, కరువు రెండూ కవలలు అని తెలియజేశారు. చంద్రబాబు మనకు ఉన్న ఏకైక నీటి ప్రాజెక్టు పోతిరెడ్డిపాడును నిర్వీర్యం చేశాడన్నారు. బాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు శ్రీశైలం ప్రాజెక్ట్‌లో 880 అడుగులకు నీటిని నిల్వ చేసిన దాఖలాలు లేవన్నారు. పోతిరెడ్డిపాడు ప్రాజెక్ట్ అభివృద్ధికి పాటుబడింది దివంగత సీఎం వైఎస్సార్ అని, తరువాత ప్రస్తుత వైఎస్ జగన్ ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ వల్ల ఎస్‌ఆర్‌ఎస్, తెలుగుగంగ, హంద్రీనీవా, చెన్నైకి నీరు ఇవ్వడం జరుగుతుందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తెలంగాణ ప్రభుత్వం పాలమూరు, దిండీ ప్రాజెక్టులు కడుతుంటే ఓటుకు నోటు కేసుకు భయపడి ప్రశ్నించకుండా సీమకు అన్యాయం చేశాడని ఎద్దేవా చేశారు. శ్రీశైలం బ్యాక్‌వాటర్‌తో 45 వేల క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తుంటే ఆనాడు ప్రశ్నించలేదన్నారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న వైఎస్ జగన్ 3 రోజులు జలదీక్ష చేసి నిరసన తెలిపారన్నారు. ఎందరో మేధావులు, పెద్ద ఎత్తున యువత మద్దతు తెలిపిన సంగతి ఈనాటికీ గుర్తుందన్నారు. ఆనాడు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండి 5 కోట్ల మంది ప్రజల ఆశలను ఓటుకు నోటు కేసు కోసం తాకట్టు పెట్టి రాయలసీమకు ద్రోహం చేశారని విమర్శించారు. నేడు రాయలసీమ ప్రాజెక్టులు అభివృద్ధి చేశానని చెప్పడం సిగ్గుచేటని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ, రాష్ట్ర టూరిజం డైరెక్టర్లు సాయికిషోర్‌రెడ్డి, మండల నాగేంద్ర, సీహెచ్ రమేష్, జనార్ధన్‌రాజు, వైఎస్సార్‌సీపీ కార్యవర్గ సభ్యులు మలిశెట్టి వెంకటరమణ, బత్తలసుబ్రమణ్యం, సర్పంచ్‌లు రామకృష్ణ, వినోద్‌లు, లక్ష్మినారాయణమ్మ, ప్రసాద్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా రహిత జిల్లాగా మారుద్దాం


మాట్లాడుతున్న ఎస్పీ గంగాధర్ రావు

రాయచోటి : అన్నమయ్య జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా మారుద్దామని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్ రావు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులను ఆదేశించారు. శనివారం అన్నమయ్య జిల్లా రాయచోటి పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో ఎస్పీ సమీక్షా సమావేశం నిర్వహించారు. నాటుసారా తయారీ, విక్రయదారులు చేసే వారిపై నమోదు చేసిన కేసుల వివరాలపై ఎస్పీ సమీక్షించారు. జిల్లాలో నాటుసారా తయారు చేసే గ్రామాలలో అధికారులు ప్రతి రోజూ 2 లేదా 3 గ్రామాలలో తనిఖీలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో అధికారులు, సిబ్బంది కలిసి కష్టపడి పని చేసి నాటుసారా రహిత జిల్లాగా తీర్చిదిద్దుటకు సహకరించాలన్నారు. జిల్లా, రాష్ట్ర సరిహద్దుల చెక్ పోస్టుల వద్ద అధికారులు ఆకస్మిక వాహన తనిఖీలు నిరంతరం నిర్వహించాలన్నారు. ప్రభుత్వం నిషేధించిన గుట్కా, ఖైనీ అక్రమ రవాణా జరగకుండా అధికారులు ఎప్పటికప్పుడు దాడులు నిర్వహించాలన్నారు. పచ్చని పల్లెల్లో జూదాలు నిర్వహించకుండా కట్టడి చేయాలని ఆదేశించారు. మదనపల్లి, మొలకలచెరువు సరిహద్దుగా ఉన్న కర్ణాటక రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. సమాచార వ్యవస్థను బలోపేతం చేసుకోవడం ద్వారా కచ్చితమైన సమాచారంతో నాటుసారా తయారు చేసే బట్టీలపైన, రవాణా చేసే ప్రదేశాల్లోను దాడులు నిర్వహించడానికి అనువుగా ఉంటుందన్నారు. నాటుసారా తయారీ, అక్రమ రవాణాలో సంబంధం ఉన్న అనుమానితులను మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి వారిని బైండోవర్ చేయాలని సూచించారు. ముఖ్యంగా ఇప్పటికే నమోదు చేసిన కేసులలో ఇన్వెస్టిగేషన్ త్వరితగతిన పూర్తి చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేసి నిందితులకు శిక్షపడేలా చూడాలని ఆదేశించారు. కేసులలో సీజ్ చేసిన వాహనాలకు తక్షణమే వేలంపాట వేయాలన్నారు. నాటుసారా తయారు చేసిన కేసులలో జైలుకు వెళ్లి వచ్చిన వారికి ప్రత్యామ్నాయ జీవనోపాధి చూపించడం ద్వారా.. తిరిగి నాటుసారా జోలికి వెళ్లకుండా గౌరవ ప్రదమైన జీవితం జీవించే విధంగా ప్రయత్నం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే నాటుసారా తయారీ విక్రయాలలో ఎక్కువ కేసులలో ఉన్న వారిపై పీడీ యాక్టు సిఫార్సు చేయాలని అధికారులకు ఎస్పీ తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు.

ఏఎఫ్‌యూలో శిల్పకళా వర్క్‌షాప్ ప్రారంభం


సమావేశంలో మాట్లాడుతున్న ఏఎఫ్‌యూ వీసీ ఆంజనేయప్రసాద్

కడప ఎడ్యుకేషన్ : డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్సిటీ(ఏఎఫ్‌యూ)లో శిల్ప కళా వర్క్‌షాప్ శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య ఆంజనేయప్రసాద్ మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్ నాలుగు రోజుల పాటు జరగనుందని తెలిపారు. సంప్రదాయ, శాస్త్రీయ పద్ధతుల మధ్య వారధిని సృష్టించడానికి శిల్ప, కళా చరిత్ర విభాగం చొరవ అవసరం అని అన్నారు. కడప గ్రామీణ ప్రాంతమైన వనిపెంటగా పిలువబడే కంసల వనిపెంట ఇత్తడి పనులకు ప్రసిద్ధి చెందిందని తెలిపారు. ఈ లోహ హస్తకళలకు 300 ఏళ్ల కంటే ఎక్కువ చరిత్ర ఉందని, దీని సంప్రదాయ క్రాఫ్ట్ పద్ధతి భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో శతాబ్దాలుగా ప్రసిద్ధి చెందిందన్నారు. గౌరవ అతిథి చెన్నై ప్రాంతీయ కార్యదర్శి సోవన్‌కుమార్ మాట్లాడుతూ శిల్ప విద్యార్థులు తమ కళాత్మక హావాభావాలను మెరుగుపరిచేందుకు కళాకారుల మెలకువలను నేర్చుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, శిల్ప కళా విభాగ కోఆర్డినేటర్ సీహెచ్ దుర్గా ప్రసాద్, శిల్పకళా అధ్యాపకులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వైవీయూలో రీజినల్ సెంటర్ కార్యదర్శి

యోగివేమన విశ్వ విద్యాలయంలోని లలిత కళా విభాగాన్ని లలిత కళా అకాడమి రీజినల్ సెంటర్ చెన్నై కార్యదర్శి డాక్టర్ ఎం.సోవన్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన క్యాంపస్‌లో గల లలిత విభాగాన్ని, కళా దర్శన్ ఎదిగిన తీరు పరిశీలించి బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో ఇక్కడ కొన్ని కార్యక్రమాలను కూడా నిర్వహించామని, త్వరలో మరిన్ని వర్క్‌షాప్‌లు నిర్వహించడానికి అవకాశం ఉందన్నారు. వైవీయూ లలిత కళా విభాగం అధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు మాట్లాడుతూ విభాగానికి అన్ని సౌకర్యాలు ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య రఘునాథరెడ్డి, విభాగ అధ్యాపకులు చదలవాడ వెంకటేష్, చినరాయుడు, ఈరప్ప, రెడ్డిశేఖర్‌రెడ్డి సుధాకర్ పాల్గొన్నారు.

అత్యుత్తమ ఫొటోగ్రఫీశాఖగా తీర్చిదిద్దుతాం

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలోని ఫొటోగ్రఫీ శాఖను దేశంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దుతామని విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆంజనేయప్రసాద్ పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం ఫొటోగ్రఫీశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఫొటోగ్రఫీ విద్యార్థులు తీసిన చిత్రాల నుంచి అత్యుత్తమమైన వాటిని ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. అనంతరం ఫొటో ఎగ్జిబిషన్‌ను వీసీ ప్రారంభించి, తిలకించారు. డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, ఫొటోగ్రఫీ విభాగం సమన్వయకర్త ఎంఆర్‌సీ సతీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళకు ఏపీఎన్‌ఆర్‌టీఎస్ సాయం

కడప కార్పొరేషన్ : మెడికల్ ఫెయిల్ అయి కువైట్‌లో ఇబ్బందులు పడుతున్న మహిళకు ఏపీఎన్‌ఆర్‌టీఎస్ సాయం చేసింది. ఆమెను సురక్షితంగా ఇండియాకు పంపేందుకు ఆ సంస్థ సభ్యులు కృషి చేశారు. వైఎస్సార్ జిల్లా కడప నగరంలోని పుట్లంపల్లె శివానందపురానికి చెందిన ఉత్తరాది లక్ష్మీదేవి 2018లో ఇంటి పని నిమిత్తం కువైట్ వెళ్లింది. అక్కడ మెడికల్ ఫెయిల్ కావడంతో కువైట్‌లో ఆకామా(రెసిడెన్సీ) ఇవ్వలేదు. కువైట్ నిబంధన ప్రకారం మెడికల్ ఫెయిల్ అయిన వారు ఎట్టి పరిస్థితుల్లోనూ స్వస్థలానికి వెళ్లిపోవాల్సిందే. అక్కడ ఉండేందుకు వీలుపడదు. ఎన్నో వ్యయప్రయాసల కోర్చి కువైట్ వచ్చిన తాను వెంటనే ఇండియాకు పోతే ఆర్థిక సమస్యలు చుట్టుముడతాయని భావించి, అక్కడే ఉండి ఏదో ఒక పని చేసుకోవాలని నిర్ణయించుకుంది. తద్వారా తనపై నమ్మకంతో కువైట్ పంపిన కుటుంబ సభ్యులకు అండగా నిలవాలని అనుకుంది. ఐదేళ్లుగా ఏదో ఒక పని చేస్తూ ఇంటికి కొంచెం కొంచెం డబ్బు పంపిస్తూ జీవనం సాగించేది. ప్రస్తుతం పోలీస్ చెకింగ్‌లు ఎక్కువగా ఉండటం వల్ల వారికి పట్టుబడితే జైలుకు పోవాల్సి వస్తుంది కాబట్టి వైఎస్సార్‌సీపీ కువైట్ కన్వీనర్ ఎం.బాలిరెడ్డి, ఏపీఎన్‌ఆర్‌టీఎస్ రీజనల్ కో ఆర్డినేటర్ ఎన్.మహేష్ రెడ్డిలను ఆశ్రయించింది. ఆమె పరిస్థితిని తెలుసుకున్న వారు భారత రాయబార అధికారులతో మాట్లాడి పేపర్ వర్క్ పూర్తి చేయించి ఈనెల 18వ తేది కువైట్ నుంచి ఇండియాకు పంపించారు. 19వ తేది ఆమె కడపకు చేరింది. ఈ సందర్భంగా లక్ష్మీదేవి మాట్లాడుతూ సమస్యల్లో ఉన్న తెలుగు వారికి సాయపడేందుకు ఏపీఎన్‌ఆర్‌టీఎస్‌ను ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపింది. తనకు సాయపడిన ఏపీఎన్‌ఆర్‌టీఎస్ చైర్మన్ మేడపాటి వెంకట్, సీఈఓ హేమలత, డైరెక్టర్ ఇలియాస్, బాలిరెడ్డి, మహేష్‌రెడ్డి, భారత ఎంబసీ అధికారులకు ధన్యవాదాలు తెలియజేసింది.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

కడప కోటిరెడ్డిసర్కిల్ : శాశ్వత లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం లభించి, కేసుల పరిష్కారం జరుగుతుందని శాశ్వత లోక్ అదాలత్, ఎపబ్లిక్ యుటిలిటీ సేవల చైర్మన్ స్వర్ణ ప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక బసవ రామతారక లా కాలేజీలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. శాశ్వత లోక్ అదాలత్ రాష్ట్ర హైకోర్టు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక చట్టం ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంచే ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇందులోని తీర్పు భారత అత్యున్నత న్యాయస్థానం తీర్పుతో సమానమని చెప్పారు. ఇందులో కేసులు 60 రోజులలోగా పరిష్కారం చేయడమే కాకుండా కోటి రూపాయల వరకు అవార్డు ఇచ్చేందుకు వెసులుబాటు ఉందన్నారు. ఈ తీర్పుకు ఎలాంటి అప్పీలు ఉండదన్నారు. పబ్లిక్ యుటిలిటి సేవలపై వివరించారు. ఈ కార్యక్రమంలో బసవ రామ తారకం లా కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.జహీరుద్దీన్, వైస్ ప్రిన్సిపాల్ శిరీష, లెక్చరర్లు, శాశ్వత లోక్ అదాలత్ మెంబర్ ఎమ్.వి.సుబ్బారెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాదు-తిరుపతి రైలు గడువు పొడిగింపు

కడప కోటిరెడ్డిసర్కిల్ : హైదరాబాదు-తిరుపతి-హైదరాబాదు (07643/07644) మధ్య నడుస్తున్న వారాంతపు స్పెషల్ రైలు గడువును పొడిగించారని కడప రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్ తెలిపారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ రైలును అక్టోబరు 3వ తేదీ వరకు పొడిగించారని ఆయన పేర్కొన్నారు. ప్రతి సోమవారం రాత్రి హైదరాబాదులో బయలుదేరి మరుసటి రోజు ఉదయం కడపకు 5.50 చేరుకొని తిరుపతికి 10 గంటలకు చేరుకుంటుందన్నారు. తిరిగి తిరుపతిలో అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి కడపకు సాయంత్రం 5.05కు చేరుకొని మరుసటి రోజు ఉదయం 5కు హైదరాబాదుకు చేరుకుంటుందని వివరించారు. ఈ అవకాశాన్ని రైల్వే ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఖైదీల ఆరోగ్యంపై అప్రమత్తంగా వ్యవహరించాలి

కడప అర్బన్ : కేంద్ర కారాగారం, ప్రత్యేక మహిళా కారాగారాల్లో వుంటున్న ఖైదీల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా వుండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎం.ప్రదీప్‌కుమార్ తెలియజేశారు. శనివారం కడప నగర శివారులోని కడప కేంద్రకారాగారం, ప్రత్యేక మహిళా కారాగారంలను జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జడ్జి ప్రదీప్‌కుమార్ తమ సిబ్బందితో సందర్శించారు. అక్కడ పురుష ఖైదీలకు, మహిళా ప్రత్యేక కారాగారంలో ఖైదీలకు వారికి అందుతున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. వసతి గదులను, వంటశాలలను, ఆసుపత్రిని పరిశీలించి తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జైలు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పుష్పగిరిలో పశుసంవర్ధక శాఖ డైరెక్టర్

వల్లూరు : పుణ్య క్షేత్రమైన పుష్పగిరిని పశు సంవర్ధక శాఖ స్టేట్ డైరెక్టర్ డాక్టర్ అమరేంద్ర కుమార్ శనివారం దర్శించుకున్నారు. పుష్పగిరి కొండపైన గల శ్రీ లక్ష్మీచెన్న కేశవస్వామి, శ్రీ సంతానమల్లేశ్వర స్వాములను దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆయన వెంట జిల్లా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శారదమ్మ, ఏడీ డాక్టర్ ఉత్తయ్య, డీడీ డాక్టర్ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.